
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

అల్లూరి సీతారామరాజు
మంగళవారం 12 మార్చి 2024
జిల్లా వార్తలు

ఎట్టకేలకు బండరాళ్ల తొలగింపు

కొయ్యూరు, మార్చి 11: మండలంలోని డౌనూరు పంచాయతీ శివారు జోడు మామిడి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై గత ఏడాది డిసెంబరులో కురిసిన వర్షాలకు దొర్లిన బండ రాళ్లను గ్రామస్థులు సోమవారం అతి కష్టమ్మీద తొలగించారు. అధికారులు స్పందించక పోవడంతో వారే ఈ పనులు చేపట్టారు.



బండరాళ్లను తొలగిస్తున్న గ్రామస్థులు



బరిలో నిలిచేదెవరో!

మన్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరనే దానిపై స్పష్టత కరువు

ఇప్పటికే అరకులోయ అసెంబ్లీ అభ్యర్థిని ప్రకటించిన టీడీపీ

బీజేపీ, జనసేనతో పొత్తు నేపథ్యంలో 'పాడేరు'పై ఉత్కంఠ

బీజేపీ ఆశిస్తున్నట్టు ప్రచారం

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

మన్యంలో సార్వత్రిక ఎన్నికల వేడి మొదలైంది. టీడీపీ, వైసీపీల తరపున ఎవరు బరిలో దిగుతారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. టీడీపీ అరకులోయ అసెంబ్లీ అభ్యర్థిగా దొన్నుదొరను ఇప్పటికే ప్రకటించగా, ఆ పార్టీ పాడేరు అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. కాగా వైసీపీ అరకులోయ అసెంబ్లీ సమన్వయకర్తగా ఉన్న రేగం మత్స్యలింగం, ఆ పార్టీ పాడేరు అసెంబ్లీ సమన్వయకర్తగా ఉన్న మత్స్యరాస విశ్వేశ్వరరాజుకే టికెట్ కేటాయిస్తారో, లేదో...స్పష్టత రావలసి ఉంది. ఇరు పార్టీల నాయకులు దీనిపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఎన్నికలకు సిద్ధమైన తరుణంలో పాడేరు అసెంబ్లీ స్థానం ఎవరికి కేటాయిస్తారనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. పాడేరు అసెంబ్లీ స్థానాన్ని టీడీపీ లేదంటే బీజేపీకి కేటాయిస్తారనే ప్రచారం సాగుతోంది. గిడ్డి ఈశ్వరి, ఎంవీవీ ప్రసాద్, కేవీ రమేశ్‌నాయుడు పేర్లను టీడీపీ అధిష్ఠానం పరిశీలిస్తూ ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల అభిప్రాయం సేకరిస్తున్నది. కాగా బీజేపీ సైతం పాడేరు స్థానాన్ని ఆశిస్తుండడంతో టీడీపీ అధిష్ఠానం అభ్యర్థిని ప్రకటించలేదని ప్రచారం జరుగుతున్నది.

టీడీపీ నాయకులు ఏకతాటిపైకి వస్తేనే..

టీడీపీలో గ్రూపులు, వర్గ పోరు లేకుండా అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని కార్యకర్తలు కోరుతున్నారు. అరకులోయ అసెంబ్లీ అభ్యర్థిగా సియ్యారి దొన్నుదొరను ప్రకటించినప్పటి నుంచి టీడీపీ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు సివేరి అబ్రహం స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని గ్రామాల్లో పర్యటిస్తున్నారు. దీని వల్ల ఎవరి వెంట తిరగాలో తెలియక పార్టీ కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు.

ఇక పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం విషయానికి వస్తే ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి వ్యవహరిస్తుండగా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు బొర్రా నాగరాజు, ఎంవీవీ ప్రసాద్, టీడీపీ మరో నేత కొట్టగుళ్లి సుబ్బారావు వేరుగా పార్టీ కార్యకలాపాలు చేపడుతున్నారు. ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి రెండు నెలల క్రితం టీడీపీలో చేరిన కిల్లు వెంకటరమేశ్‌నాయుడు మరో వర్గంగా తన కార్యకలాపాలు చేస్తున్నారు. దీంతో ఎవరితో ముందుకు నడవాలో అర్థం కాక నియోజకవర్గంలోని టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సందిగ్ధంలో ఉన్నారు. అధిష్ఠానం చొరవ తీసుకుని ఏజెన్సీలో పార్టీ నాయకులను ఏకతాటిపైకి తీసుకురావాలని కార్యకర్తలు కోరుతున్నారు. అలా చేయగలిగితే విజయం తథ్యమని చెబుతున్నారు.



పాడేరు డిగ్రీ కళాశాల ఆవరణలో అధికారులకు సూచనలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

సదుపాయాల కల్పనపై అధికారులకు ఐటీడీఏ పీవో సూచన

పాడేరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అరకులోయ అసెంబ్లీ స్థానం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఎన్నికల ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. అరకులోయ అసెంబ్లీ స్థానానికి సంబంధించిన ఎన్నికల సామగ్రికి సంబంధించి స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాలు తదితరాలను ఆయన స్వయంగా పరిశీలించారు. మండలాల వారీగా ఈవీఎంల పంపిణీ, స్వీకరణకు కౌంటర్లు, ఎన్నికల సిబ్బందికి ఫుడ్ కౌంటర్లు ఎలా ఏర్పాటు చేయాలనే దానిపై అధికారులను ఆయన సూచించారు. డిగ్రీ కళాశాల మైదానం అంతా విద్యుత్ వెలుగులు ఉండాలని, ఎన్నికల సిబ్బంది సామగ్రి తరలించేందుకు, ఎన్నికల అనంతరం ఆయా యంత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది, రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లకు వేర్వేరుగా ప్రవేశ ద్వారాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీఈఈ పి.అనుదీప్, అరకులోయ తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, తదితరులు వున్నారు.

ఓటర్లకు తాయిలాలు!

ప్రలోభపెట్టేందుకు వైసీపీ నాయకుల యత్నాలు

- ఇప్పటికే స్వీట్లు, చీరలు, డబ్బులు పంపిణీ ప్రారంభం
- కుల సంఘాలు, ఇతర సంఘాల నేతలతో రహస్య సమావేశాలు
- ఎన్నికల్లో సహకరించాలంటూ కానుకల పంపిణీ



- తాయిలాలకు పడిపోతే భవిష్యత్తు అంధకారమే
- మంచి నేతను ఎన్నుకుంటేనే మనుగడ అంటున్న నిపుణులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. మరి కొద్ది రోజుల్లో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజకీయ పార్టీలు సమరానికి సన్నద్ధమవుతున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో కొంత మంది ప్రచారాన్ని కూడా ప్రారంభించారు. ఎలాగైనా విజయం సాధించేందుకు వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఇందులో భాగంగా ఓటర్లకు తాయిలాలు పంచి గెలుపు గుర్రం ఎక్కాలని కొంతమంది ఉవ్విళ్లూరుతున్నారు. వర్గాల వారీగా ప్రజల అవసరాలు గుర్తించి వాటిని తీర్చడం ద్వారా గంపగుత్తగా ఓట్లను కొల్లగొట్టేందుకు ఎత్తులు వేస్తున్నారు.

ఓటర్లను వివిధ రకాలుగా ప్రలోభపెట్టడం, తాయిలాలు అందించి ఆకట్టుకునే చర్యల్లో అధికార వైసీపీ నాయకులు ముందున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇప్పటికే పలువురు అభ్యర్థులు భారీఎత్తున కానుకల పంపిణీని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరిస్తున్న నేతల అనుచరులు...యూనియన్లు, కుల సంఘాలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ల వారీగా అవసరాలను తెలుసుకుంటున్నారు. వాటిని నెరవేర్చడం ద్వారా ఓట్లను కొల్లగొట్టే వ్యూహాలు రచిస్తున్నారు. ఇందుకోసం ఎంత ఖర్చయినా భరించేందుకు కూడా సిద్ధమవుతున్నారు.

వైసీపీ కానుకల పంపిణీ

ఉమ్మడి విశాఖ జిల్లాలో పలువురు వైసీపీ నాయకులు కానుకల పేరుతో మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్నారు. విశాఖలో కొద్దిరోజుల కిందట ఇంటింటికీ స్వీట్ బాక్సులను అందించారు. ఓ కీలక నేత ఓటర్లకు దుస్తులు పంపిణీ చేయడంతో పాటు మహిళలకు చీరలు, ఇతర ఖర్చులకు రూ.500 చొప్పున పంపిణీ చేశారు. ప్రలోభాలకు ఓటర్లు లొంగిపోతే రానున్న రోజుల్లో ఈ నాయకులు మరింత రెచ్చిపోతారనే వాదన వినిపిస్తోంది.

అవసరాలు తెలుసుకుని..

వచ్చే ఎన్నికల్లో విజయం కోసం ప్రయత్నిస్తున్న కీలక నేతలు..వ్యక్తిగతంగా ప్రతి ఓటరును కలుస్తూనే...గంపగుత్తగా పడే ఓట్లపై దృష్టి సారించారు. ఇందుకు కుల, వృత్తి సంఘాలు, అసోసియేషన్లను ఎంచుకుంటున్నారు. ఆయా సంఘాల ముఖ్య నాయకులతో సమావేశమై వారి అవసరాలను తీరుస్తామని, ఎన్నికల్లో సహకరించాలని కోరుతున్నారు. ఇందుకోసం ఒక్కో నేతకు క్షేత్రస్థాయిలో రెండు, మూడు బృందాలు పనిచేస్తున్నాయి. వీరంతా నియోజకవర్గ పరిధిలోని కీలక సంఘాలు, అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశం కావడం, వారి అవసరాలను తెలుసుకుని పోటీలో ఉన్న నేతకు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం నగర పరిధిలోని మూడు నియోజకవర్గాలకు చెందిన అధికార పార్టీ నేతలు ఇదే పనిలో ఉన్నట్టు సమాచారం. ఖర్చుకు వెనుకాడని ఈ నాయకులు యువతపైనా దృష్టి సారిస్తున్నారు. క్రికెట్ ... మిగతా 8వ పేజీలో



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేశ్, వెనుక వరుసలో నిందితులు

200 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరి అరెస్టు

పరారీలో ఉన్న మరో ఇద్దరు ప్రధాన నిందితుల కోసం గాలింపు

చింతపల్లి, మార్చి 11: ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి మైదాన ప్రాంతాలకు ట్రాక్టర్‌పై తరలిస్తున్న 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని స్థానిక సీఐ కె.రమేశ్ తెలిపారు. గంజాయి తరలిస్తున్న ఇద్దరు కూలీలను అరెస్టు చేయగా, ఇద్దరు ప్రధాన నిందితులు పరారీలో ఉన్నారన్నారు. దీనికి సంబంధించిన వివరాలను సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు.

ఒడిశా రాష్ట్రం చింతల్ ధూళి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నర్సీపట్నానికి చెందిన గంజాయి వ్యాపారి(ప్రధాన నిందితుడు)కి 200 కిలోల గంజాయిని విక్రయించాడు. గంజాయి వ్యాపారి ట్రాక్టర్‌లో గంజాయి బస్తాలను లోడ్ చేసుకుని నర్సీపట్నం తరలిస్తుండగా మార్గమధ్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారని సమాచారం తెలుసుకుని జి.మాడుగుల మండలం లువ్వసింగి పంచాయతీ కిల్లుపల్లి గ్రామంలో అదే గ్రామానికి చెందిన పాంగి శ్రీనుకి అప్పగించాడు. గంజాయి లోడ్‌తో ఉన్న ట్రాక్టర్‌ను డౌనూరు గ్రామ ... మిగతా 8వ పేజీలో

రాళ్లగెడ్డపై వంతెన నిర్మాణం జరిగేనా?

టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు

వైసీపీ అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైనం

కుంబిడిసింగి పంచాయతీ ప్రజలకు తప్పని అవస్థలు

రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

జి.మాడుగుల, మార్చి 11: ఏళ్లు గడుస్తున్నా మండలంలోని కుంబిడిసింగి పంచాయతీ ప్రజల కష్టాలు తీరడం లేదు. రాళ్లగెడ్డపై వంతెన నిర్మాణం జరగక ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలంలో గెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో ప్రాణాలకు తెగించి రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా, వైసీపీ అధికారంలోకి వచ్చాక పట్టించుకోకపోవడంతో వంతెన నిర్మాణం కలగా మిగిలింది.



రాళ్ల గెడ్డపై రాకపోకలకు అనువుగా రాళ్లు పేర్చుకుంటున్న కుంబిడిసింగి గ్రామస్థులు (ఫైల్ ఫొటో)



చందాలు వేసుకుని గెడ్డపై దారి ఏర్పాటు చేసుకుంటున్న గిరిజనులు (ఫైల్ ఫొటో)

మండలంలోని కుంబిడిసింగి, పెదలోచలి, వంతాల పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల గిరిజనులు జి.మాడుగులకు రాకపోకలు సాగించాలంటే రాళ్లగెడ్డను దాటాలి వర్షాకాలంలో ఈ గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో పలు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఈ క్రమంలో గత టీడీపీ ప్రభుత్వం 2019 జనవరిలో రాళ్లగెడ్డ వంతెన నిర్మాణానికి రూ.1.15 కోట్లు మంజూరు చేసింది. అయితే ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ వంతెన నిర్మాణాన్ని పట్టించుకోలేదు. ఏడాది క్రితం పంచాయతీ సందర్శనకు వచ్చిన పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి వంతెన లేక పడుతున్న అవస్థలను స్థానికులు వివరించారు. వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని అప్పట్లో ఆమె హామీ ఇచ్చారు. అయితే అది ఇంతవరకు కార్యరూపం దాల్చ లేదు. గత్యంతరం లేక స్థానికులు గెడ్డపై రాళ్లు పేర్చి రాకపోకలు సాగిస్తున్నారు. ఎమ్మెల్యే హామీ నెరవేరకపోవడంతో ఈ ప్రాంత గిరిజనులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జి.మాడుగుల ఏఈటీడబ్ల్యూ ఇంజనీర్ వివరణ కోరగా కుంబిడిసింగి రోడ్డులో రాళ్లగెడ్డ వంతెన నిర్మాణానికి సంబంధించి టెండర్ దశలో ఉందని, త్వరలోనే పనులు చేపడతామన్నారు.



ఘాట్‌లో హద్దులను రికార్డుల ఆధారంగా పరిశీలిస్తున్న స్క్వాడ్ డీఎఫ్‌వో, తదితరులు

హద్దు దాటిన అటవీ సిబ్బందిపై చర్యలకు రంగం సిద్ధం

చెట్ల నరికివేతపై మరోసారి విచారణ

కొయ్యూరు, మార్చి 11: రాజమహేంద్రవరం-విజయనగరం జాతీయ రహదారి 516-ఇ నిర్మాణానికి సంబంధించి హద్దు దాటి చింతాలమ్మఘాట్ రోడ్డులో చెట్లు నరికివేసిన అటవీ సిబ్బందిపై చర్యలకు రంగం సిద్ధమైంది. దీనిలో భాగంగా సోమవారం మూడు జిల్లాల స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరంతో పాటు చింతపల్లి డీఎఫ్‌వో, మరో ఇద్దరు సబ్ డీఎఫ్‌వోలతో కూడిన బృందం మరోసారి అవసరానికి మించి తొలగించిన చెట్ల విషయమై పరిశీలన చేశారు. చింతాలమ్మఘాట్(ఏడొంపులఘాట్)లో రహదారి నిర్మాణాలకు నిర్దేశించిన అలైన్‌మెంట్‌ను దాటి పెదవలస ఫారెస్టు రేంజ్ పరిధిలో 30 చెట్లు, కృష్ణాదేవిపేట రేంజ్ పరిధిలో 59 చెట్లను కొయ్యూరు అటవీ సిబ్బంది నరికి వేసిన విషయం తెలిసిందే. దీనిపై 'ఆంధ్రజ్యోతి' లో వరుస కథనాలు ప్రచురితం కావడంతో చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు(సీసీఎఫ్) స్పందించి విచారణకు ఆదేశించారు. ఇప్పటికే పరిశీలన జరిపిన స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం 29 చెట్లకు సంబంధించిన మొదళ్లను గుర్తించి నివేదిక ఇచ్చారు. దీనిపై సంతృప్తి చెందని సీసీఎఫ్ సమగ్ర విచారణకు ఆదేశించారు.

దీంతో సోమవారం స్క్వాడ్ డీఎఫ్‌వోతో పాటు చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ, ఎలమంచిలి, ఆర్‌వీ నగర్ సబ్ డీఎఫ్‌వోలు కుమార్ పెర్నాడరాజులతో కూడిన బృందం ఘాట్‌రోడ్డులో సోమవారం విచారణ జరిపింది. గతంలో నరికిన చెట్లకు అదనంగా మరో ఆరు చెట్లు తొలగించినట్టు ఈ విచారణలో గుర్తించారు. నరికిన చెట్లు అన్నీ జాతీయ రహదారికి నిర్దేశించిన అలైన్‌మెంట్ దాటి ఉన్నట్టు నిర్ధారించారు. అనంతరం ఈ బృందం కాకరపాడు అటవీ డిపోను సందర్శించి అదనంగా తొలగించిన చెట్లకు సంబంధించిన కలప ఉందో?, లేదో? పరిశీలించారు. ఇందులో భాగంగా అదనంగా చెట్లు నరికించిన సిబ్బందిని విచారించారు. ఈ సందర్భంగా స్క్వాడ్ డీఎఫ్‌వో మాట్లాడుతూ సీసీఎఫ్ ఆదేశాలను అనుసరించి విచారణ జరిపామన్నారు. విచారణకు సంబంధించిన వివరాలను సీసీఎఫ్‌కు నివేదిస్తామన్నారు. హద్దు దాటి చెట్లు నరికిన విషయమై బాధ్యులపై చర్యలకు సంబంధించి ఉన్నతాధికారులదే తుది నిర్ణయమని ఆయన చెప్పారు.

కమ్ముకున్న పొగమంచు



పాడేరులో పది రోజుల తరువాత సోమవారం మళ్లీ పొగమంచు కమ్ముకుంది. గత రెండు రోజులుగా వాతావరణంలో మార్పుల కారణంగానే పొగమంచు కురిసింది. వేసవి సమీపించడంతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండడంతో పొగమంచు జాడ లేకుండా పోయింది. తాజాగా వాతావరణం మారడంతో సోమవారం తెల్లవారుజాము నుంచి ఎనిమిది గంటల వరకు పాడేరు, పరిసర ప్రాంతాల్లో పొగమంచు అలముకుంది.

-పాడేరు/ఆంధ్రజ్యోతి

కాఫీ గింజల ఉత్పత్తిలో నాణ్యత పాటిస్తే గరిష్ఠ ధరలు

కాఫీ బోర్డు డీడీ రమేశ్

చింతపల్లి, మార్చి 11: ఆదివాసీ రైతులు కాఫీ గింజల ఉత్పత్తిలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే గిరిష్ఠ ధరలు పొందవచ్చునని కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్(విస్తరణ) ఎస్.రమేశ్ తెలిపారు. సోమవారం స్థానిక కాఫీ శుద్ధి కర్మాగారంలో ఆదివాసీ రైతులకు రాయితీ ఎలక్ట్రానిక్ పల్పర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ రైతులు కాఫీ గింజలను చెర్రీగా విక్రయించుకుని, అధిక ధర పొందలేకపోతున్నారన్నారు. రైతులు పార్చిమెంట్ ఉత్పత్తి చేసుకుని మార్కెటింగ్ చేసుకుంటే రెట్టింపు ధర వస్తుందన్నారు. గతంలో ఆదివాసీ రైతులకు కాఫీ బోర్డు హ్యాండ్ పల్పర్లను పంపిణీ చేసేదన్నారు. దీంతో రైతులు పార్చిమెంట్ తయారీకి ... మిగతా 8వ పేజీలో



కాఫీ రైతు రాములమ్మకు ఎలక్ట్రానిక్ కాఫీ పల్పర్ అందజేస్తున్న డీడీ రమేశ్

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	6.09
సహరి (బుధ)	4.54

క్రైం... crime news

ఎస్‌బీఐ కాలనీలో చోరీ

అనకాపల్లి టౌన్, మార్చి 11: కొత్తూరు పంచాయతీ పరిధిలోని ఎస్‌బీఐ కాలనీలోని ఒక ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దీనికి సంబంధించి బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్ఐ మహ్మద్ అలీ తెలిపారు. ఎస్‌బీఐ కాలనీలో నివాసముంటున్న పఠాన్ బాజీ షాహిద్ ఈ నెల 9వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి తన స్వగ్రామమైన దేవరాపల్లి మండలం ఎ.కొత్తపల్లి పంచాయతీ సంజీవమెట్టకు వెళ్లారు. ఆదివారం సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి వెనుక తలుపులు తెరిచి వున్నాయి. ఆందోళన చెంది పడక గదిలోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. ఇందులో భద్రపరిచిన రెండున్నర తులాల బంగారం వస్తువులు, రెండు వెండి గ్లాసులు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని నిర్ధారించుకున్న షాహిద్... పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళ నుంచి పది మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, మార్చి 11: కొత్తూరు పంచాయతీ పరిధిలోని ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ వద్ద సత్యనారాయణపురానికి చెందిన కోరిబిల్లి నాగమణి నుంచి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు. ఈమె తన వద్ద మద్యం విక్రయిస్తున్నదని, ఇందుకోసం ప్రభుత్వ మద్యం దుకాణంలో మద్యం సీసాలు కొనుగోలు చేసి తీసుకెళుతుండగా తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు.

దలాయిపాలెంలో..

పరవాడ, మార్చి 11: మండలంలోని వాడచీపురుపల్లి పంచాయతీ దలాయిపాలెం గ్రామానికి చెందిన ఎస్ఎస్ పడియర్ నుంచి ఆదివారం రాత్రి పది క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ బాల సూర్యారావు తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి కొనుగోలు చేసి తీసుకెళుతుండగా నిఘా వేసి పట్టుకున్నట్టు పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

నక్కపల్లి, మార్చి 11: మండలంలోని రాజయ్యపేట గ్రామానికి చెందిన ఒక వివాహిత ఆదివారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సీఐ విజయ్ కుమార్ సోమవారం ఆ గ్రామానికి వెళ్లి ఆరా తీశారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు.. రాజయ్యపేట గ్రామానికి చెందిన వాసుపల్లి రాజుకు మద్యం సేవించే అలవాటు వుంది. ఈ వ్యసనాన్ని మానుకోవాలని భార్య సింహాచలం పలుమార్లు కోరింది. అయినా అతను వినలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. సింహాచలం డీజిల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకోవడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

దేవీనగర్‌లో దారుణం

- రుబ్బురోలుతో అత్తను కొట్టిన కోడలు
- తీవ్రగాయాలతో మృతి


సింహాద్రమ్మ (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్, మార్చి 11: పట్టణానికి ఆనుకుని వున్న కొత్తూరు పంచాయతీ దేవీనగర్‌లో సోమవారం దారుణం చోటు చేసుకుంది. అత్తాకోడళ్ల మధ్య జరిగిన గొడవ పెద్దదై ఒక ప్రాణం తీసింది. కోడలు రుబ్బురోలు సన్నిగొడ్డతో తలపైన, ముఖం పైన బలంగా మోదడంతో అత్త మృతిచెందింది. ఈ సంఘటనకు సంబంధించి పట్టణ సీఐ జి.శంకరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తూరు పంచాయతీ దేవీనగర్‌కు చెందిన ఈగల సన్యాసిరావు, సింహాద్రమ్మ(65) దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అందరికీ వివాహాలయ్యాయి. కుమారుడు గణేశ్ తుమ్మపాలకు చెందిన పూర్ణను 2007లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం వీరికి ఒక బాబు, ఒక పాప ఉన్నారు. తండ్రి, కొడుకు ఒకే ఇంటిలో పక్క పక్క గదుల్లో కుటుంబాలతో కలిసి నివాసం వుంటున్నారు. ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్న గణేశ్ సోమవారం ఉదయం విధులకు వెళ్లిపోయాడు. వీరి పిల్లలను స్కూల్‌కు దిగబెట్టేందుకు ఉదయం 8.30 గంటల సమయంలో సన్యాసిరావు పట్టణంలోకి వెళ్లారు. ఈ సమయంలో అత్త, కోడలు మధ్య గొడవ జరిగింది. ఇదికాస్తా ముదరడంతో పూర్ణ రుబ్బురోలు సన్నిగొడ్డతో సింహాద్రమ్మ తల, ముఖం మీద బలంగా కొట్టింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడి స్పృహతప్పి పడిపోయింది. అనంతరం పూర్ణ బయటకు వెళ్లిపోయింది. ఇదే సమయంలో ఇంటికి వస్తున్న సన్యాసిరావు.. రోడ్డుపై వెళుతున్న కోడలు పూర్ణను ఎంత పిలిచినా ఆగలేదు. అప్పటికే సింహాద్రమ్మ కేకలకు చుట్టుపక్కల వారు వచ్చారు. ఇంటిలోపలికి వెళ్లిన సన్యాసిరావు, రక్తపుమడుగులో పడివున్న భార్యను చూసి 108కు ఫోన్ చేసి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. కానీ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. ఇదిలావుండగా అత్త, కోడలు మధ్య కొంతకాలం నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల దిశ మహిళా పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లడంతో పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ చేశారు. అయినా గొడవ పడడం ఆపలేదని తెలిసింది. మృతురాలి భర్త సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. నిందితురాలు పూర్ణ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

వలంటీర్లకు నజరానాలు

- పదేసి వేల రూపాయలు పంచుతున్న అధికార పార్టీ ప్రజా ప్రతినిధి
- ఎన్నికల సమయంలో ఓటర్లకు డబ్బు పంపిణీ చేయాల్సి ఉంటుందని వెల్లడి

అనకాపల్లి, మార్చి 11: అనకాపల్లి జిల్లాలో అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధి ఒకరు తన ప్రధాన అనుచరుల ద్వారా గత మూడు రోజులుగా వలంటీర్లకు నగదు నజరానాగా పంపిణీ చేయిస్తున్నారు. రోజుకు మూడు నుంచి నాలుగు పంచాయతీల వలంటీర్లను నియోజకవర్గ పరిధిలో గల అధికార పార్టీకి చెందిన నాయకుని అతిథి గృహానికి రమ్మంటున్నారు. వలంటీర్లు గెస్ట్ హౌస్ వద్దకు వెళ్లిన వెంటనే మొత్తం తనిఖీ చేస్తున్నారు. సెల్‌ఫోన్లు తీసుకొని గెస్ట్‌హౌస్‌లోనికి పంపుతున్నారు. ఒక్కొక్క వలంటీర్‌కు రూ.పది వేలు ఇస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పూర్తి సహకారం అందించాలని చెబుతున్నారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో ఓటుకు ఇంత అని తాము ఇస్తామని, వాటిని ఓటర్లకు పంపిణీ చేయాల్సి ఉంటుందని కూడా చెబుతున్నారు. ఓటర్లకు పంచడానికి డబ్బులు చేతికే ఇస్తామని, అందరికీ సక్రమంగా చేరాలని...అవకతవకలకు పాల్పడితే తర్వాత దారుణమైన చర్యలుంటాయని కూడా హెచ్చరించినట్టుట్టు తెలిసింది. డబ్బులు తీసుకొని బయటకు వచ్చిన తరువాత సెల్‌ఫోన్ తిరిగి ఇస్తున్నారు. నియోజకవర్గంలో రెండు మండలాలకు చెందిన వలంటీర్లకు నగదు పంపిణీ పూర్తయ్యిందని, మరో రెండు మండలాల వలంటీర్లకు ప్రారంభమయ్యిందని తెలిసింది.

బాడీ బిల్డింగ్ పోటీల్లో జిల్లాకు ప్రథమ స్థానం



బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన మారునాయుడు

కొత్తూరు (అనకాపల్లి), మార్చి 11: సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో అనకాపల్లి జిల్లాకు చెందిన బాడీ బిల్డర్ సత్తాచాటి ప్రథమ స్థానంలో నిలిచినట్టు జిల్లా బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అమరపల్లి కృష్ణాజీ, శిలపరశెట్టి బాబీ తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో కర్ణాటక రాష్ట్రం దావణగెరెలో జరిగిన సౌత్ ఇండియా డ్రీమ్స్ క్లాసిక్ బాడీ బిల్డింగ్ పోటీల్లో చోడవరం ప్రాంతానికి చెందిన ఎన్.ఎం.మారునాయుడు 80 కేజీల విభాగంలో మొదటి స్థానం సాధించాడని చెప్పారు. నిర్వాహకులు రూ.50 వేల నగదుతోపాటు అవార్డు అందజేశారని తెలిపారు. కాగా పంజాబ్‌లో ఈ నెల 16, 17 తేదీల్లో జరగనున్న జాతీయ పోటీల్లో మారునాయుడు పాల్గొననున్నట్టు రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు స్వామి రమేశ్, వి.శ్రీనివాసరాజు తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

ఎంజేపురంలో గ్రావెల్ దోపిడీ

- ఉపాధి పనులు మాటున అక్రమ తవ్వకాలు
- దర్జాగా అమ్ముకుంటున్న అధికార పార్టీ నేతలు
- పట్టించుకోని రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది


రోడ్డు పనుల కోసం గ్రావెల్ తవ్వుతున్న ఉపాధి కూలీలు

అచ్యుతాపురం, మార్చి 11: ఉపాధి పనులు మాటున అధికార పార్టీ నాయకులు గ్రావెల్ దోపిడీకి పాల్పడుతున్నారు. సెలవు రోజుల్లో, రాత్రి వేళల్లో కొండవాలు ప్రదేశంలో యంత్రాలతో గ్రావెల్ తవ్వి తరలించుకుపోతున్నారు. ఈ విషయం ఉపాధి హామీ పథకం అధికారులకు, స్థానిక రెవెన్యూ సిబ్బందికి తెలిసినప్పటికీ, గ్రావెల్ తవ్వకుపోతున్నది వైసీపీ మద్దతుదారులు కావడంతో పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.


ఎంజేపురంలో ఒక ఖాళీ స్థలంలో తోలిన గ్రావెల్

అచ్యుతాపురం మండలం ఎంజేపురం గ్రామానికి ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు మంజూరయ్యాయి. అయితే కొన్ని వీధులు లోతట్టుగా వుండడంతో తొలుత గ్రావెల్‌తో ఎత్తుచేసి, అనంతరం సిమెంట్ కాంక్రీట్ వేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం గ్రామానికి ఆనుకుని వున్న కొండవాలు ప్రదేశంలో గ్రావెల్ తవ్వడానికి పంచాయతీ అధికారులు అనుమతులు ఇచ్చారు. గ్రావెల్‌తోపాటు వచ్చే రాళ్లను కూడా వినియోగించుకునే వెసులుబాటు కల్పించారు. కొద్ది రోజుల క్రితం ఉపాధి కూలీలతో గ్రావెల్ తవ్వి, సీసీ రోడ్లు వేసే వీధుల్లోకి తరలిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన స్థానిక అధికార పార్టీ నాయకులు రాత్రిపూట, సెలవు రోజుల్లో కొండవాలు ప్రదేశంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ట్రాక్టర్లలోకి లోడింగ్ చేసి భవన నిర్మాణాల్లో పునాదులు నింపడానికి, ఖాళీ స్థలాలను ఎత్తు చేయడానికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రావెల్ తవ్వేటప్పుడు వచ్చే రాళ్లను అక్కడే వదిలేస్తున్నారు. ఉపాధి కూలీలు గ్రావెల్‌తోపాటు రాళ్లను కూడా సీసీ రోడ్ల పనులకు వినియోగిస్తున్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాల గురించి వీఆర్వోకు, పంచాయతీ సిబ్బందికి తెలిసిన పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

సచివాలయ ఉద్యోగినిపై సర్పంచ్ ఆగ్రహం

- తనకు సమాచారం ఇవ్వకుండా సెలవు ఎలా పెట్టావని నిలదీత
- విధులకు హాజరుకాకుండా కొంత సేపు అడ్డగింత
- గాంధీగ్రామం సచివాలయం వద్ద ఘటన

చోడవరం, మార్చి 11: సచివాలయ ఉద్యోగినిపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా ఆమె కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్న అధికార పార్టీకి చెందిన సర్పంచ్ తీరు వివాదాస్పదమైంది. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. గాంధీగ్రామం సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఈశ్వరసాయి సోమవారం ఉదయం సచివాలయానికి హాజరయ్యారు. అప్పటికే అక్కడ ఉన్న ఆ పంచాయతీ అధికార పార్టీకి చెందిన సర్పంచ్ గాడి అప్పారావు వేచి ఉన్నారు. ఆమె విధులకు హాజరుకాకుండా అడ్డుకున్నారు. తనకు సమాచారం ఇవ్వకుండా సెలవు ఎందుకు పెట్టావని నిలదీశారు. తనకు ఆరోగ్యం బాగోలేదని దీనిపై పంచాయతీ కార్యదర్శి, ఎండీవోకు సమాచారం ఇచ్చి సెలవు పెట్టానని ఆమె తెలిపారు. అయినా ఆమె కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో ఆమె కంటతడి పెట్టుకున్నారు. కొంత సమయం తరువాత ఆమె విధులకు హాజరయ్యారు. దీనిపై సర్పంచ్ వివరణ కోరగా ఇళ్ల లబ్ధిదారులు నెల రోజుల నుంచి బిల్లులు అప్‌లోడ్ చేయాలని సచివాలయం చుట్టూ తిరుగుతున్నారని, వారికి ఎవరూ సమాధానం చెప్పడం లేదన్నారు. సచివాలయ ఉద్యోగుల పనితీరు బాగోలేదని, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి బిల్లులు ఆగిపోతే ఎవరు సమాధానం చెబుతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు ఎవరికి నచ్చిన సమయంలో వారు వస్తున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పడం లేదని తెలిపారు. సర్పంచ్‌కి కనీస విలువ ఇవ్వడం లేదని ఆయన చెప్పారు.


సచివాలయం వద్ద ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచ్ అప్పారావు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

- వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి
- 'అనకాపల్లి' ఉమ్మడి అభ్యర్థి కొణతాల పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

అనకాపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి జరగాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుందని అనకాపల్లి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఒక ప్రైవేటు కళ్యాణ మండపంలో జరిగిన టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనవల్ల అభివృద్ధి కుంటుపడిందని, అందువల్ల రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరారవు మాట్లాడుతూ, వైసీపీ పాలనలో అన్ని రంగాలు కుదేలయ్యాయని ఆరోపించారు. నాయకులెవరూ భేషిజాలకు పోవద్దని, అనకాపల్లిలో ఉమ్మడి అభ్యర్థి గెలుపు కోసం మూడు పార్టీల శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని కోరారు. పీలా గోవింద మాట్లాడుతూ, రాష్ట్రంలో భావితరాల బాగు కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడాల్సి వచ్చిందన్నారు. చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రి చేయాలన్నదే అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అనకాపల్లి టౌన్, కశింకోట, అనకాపల్లి మండలాలకు చెందిన నాయకులు, ముఖ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ మళ్లీ ప్రధాని కావడం ఖాయం

- కొణతాల రామకృష్ణ

కొత్తూరు, మార్చి 11: దేశంలో నరేంద్ర మోదీ గాలి వీస్తోందని, ఆయన మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక చదువుల వారి వీధిలో ఉన్న బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిమూర్తులైన మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలవడంతో రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, డాక్టర్ విక్రమ్, గంటి అప్పారావు, గంగుపాం నాగేశ్వరరావు, కొణతాల అప్పలరాజు, ఉగ్గిన రమణమూర్తి, గొంతిన శ్రీనివాసరావు, శ్రీరామదాసు గోవింద పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారానికి కృషి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- ప్రజల నుంచి 246 వినతులు స్వీకరణ


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల (అనకాపల్లి), మార్చి 11: స్పందన అర్జీలను త్వరగా పరిష్కరించడానికి కృషి చేయాలని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి, అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డీఆర్‌ఓ బి.దయానిధితో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 246 అర్జీలు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, స్పందనలో అందిన వినతులను పరిష్కరించలేకపోతే అందుకుగల కారణాలను అర్జీదారులకు లిఖితపూర్వకంగా తెలియపరచాలన్నారు. కాగా ల్యాండ్ పూలింగ్‌లో తమ భూములను బలవంతంగా తీసుకున్నారని, అభివృద్ధి చేసిన స్థలాలను ఇంతవరకు తమకు అప్పగించలేదని పాపయ్యపాలెం గ్రామానికి చెందిన పలువురు స్పందనలో ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో స్థలాలు ఇవ్వడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా అధికార పార్టీ నాయకులు రెవెన్యూ రికార్డులను ట్యాంపరింగ్ చేసి తన భూములను ఆక్రమించారని పాయకరావుపేటకు చెందిన గాబు దొరయ్య ఫిర్యాదు చేశారు. గతంలో పలుమార్లు స్పందనలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఎస్‌వీఎస్‌సుబ్బలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొంతమంది సమస్యలను స్వయంగా ఆలకించి, న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. స్పందన కార్యక్రమంలో 28 అర్జీలు అందాయి. వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలకు సంబంధించినవి అధికంగా వున్నాయి. ప్రతి అర్జీని పరిష్కరించేలా చొరవ చూపాలని, వీటిపై నిర్ణీత గడువులోగా ఏ చర్యలు తీసుకున్నారో నివేదికలు అందించాలని పోలీసు అధికారులకు సూచించారు.

వైసీపీ పాలనలో సర్పంచులకు కష్టాలు

- నిధులు, విధులు లేక ఉసూరు
- మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



గన్నవరం సభలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

నాతవరం, మార్చి 11: వైసీపీ పాలనలో సర్పంచులకు కష్టాలు తప్పడం లేదని, నిధులు, విధులు లేక ఉసూరుమంటున్నారని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఎన్నికల శంఖారావంలో భాగంగా సోమవారం రాత్రి గన్నవరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ సర్పంచులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులను ముఖ్యమంత్రి జగన్ దారి మళ్లిస్తున్నారని, దీంతో వైసీపీకి చెందిన సర్పంచులు కూడా బాధపడుతున్నారని పేర్కొన్నారు. తాండవ ఎత్తిపోతల పథకానికి ముఖ్యమంత్రి జగన్ రూ.470 కోట్లతో శంకుస్థాపన చేసి ఏడాది కావస్తున్నా ఇప్పటికీ నిధులు మంజూరు చేయలేదన్నారు. నర్సీపట్నం నియోజకవర్గ జనసేన నాయకుడు రాజాన వీరసూర్యచంద్ర మాట్లాడుతూ సచివాలయాల నిర్మాణానికి వాడే సిమెంట్ బస్తాలను వైసీపీ నాయకులు మాయం చేస్తున్నారన్న విషయాన్ని మండల సమావేశంలో వైసీపీకి చెందిన ఎంపీపీ లక్ష్మణమూర్తే స్వయంగా చెప్పారని పేర్కొన్నారు. నాతవరం మండలంలో 11 లేఅవుట్లను ఎందుకు రద్దు చేశారో చెప్పాలన్నారు. మాజీ ఎంపీపీ సింగంపల్లి సన్యాసిదేముడు మాట్లాడుతూ గన్నవరంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 13 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. అనంతరం శృంగవరం గ్రామంలో నిర్వహించిన ఎన్నికల శంఖారావం సభలో అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, నర్సీపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లాలం అచ్చిరాజు, మాజీ ఎంపీపీ ఎస్.విజయ్‌కుమార్, తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

రూ.2 వేల కోట్లతో అనకాపల్లి- ఆనందపురం రహదారి

- ఆరు వరుసలు...50.8 కి.మీ. పొడవు
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ


అనకాపల్లి- ఆనందపురం నడుమ ఆరు వరుసల రహదారి

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నగరానికి ట్రాఫిక్ తాకిడి తగ్గించడానికి జాతీయ రహదారి-16లో భాగంగా అనకాపల్లి-ఆనందపురం మధ్య నిర్మించిన ఆరు వరుసల రహదారి నిర్మాణం ఏడాది క్రితం పూర్తయింది. దీనిని మంగళవారం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అనకాపల్లి నుంచి సబ్బవరం, పెందుర్తి మీదుగా ఆనందపురం వరకు నిర్మించిన ఈ రహదారి పొడవు 50.8 కిలోమీటర్లు. ఆరు వరుసల్లో నిర్మించిన ఈ రహదారి నిర్మాణానికి రూ.2 వేల కోట్లు వెచ్చించారు. వాస్తవానికి ఇది 2021లోనే పూర్తి కావలసి వుండగా కరోనా కారణంగా ఆలస్యమైంది. ఏడాది కాలంగా ఈ రహదారిపై రాకపోకలు సాగుతున్నాయి. ఈ మార్గంలో 21 అండర్ బ్రిడ్జిలు, 2 రైల్వే వంతెనలు, మరో 10 సాధారణ వంతెనలు, 52 బాక్స్ ఆకారంలో కల్వర్టులు, వివిధ గ్రామాలను హైవేతో కలుపుతూ 25 అప్రోచ్ రోడ్లు, 44 కల్వర్టులు నిర్మించారు. సబ్బవరం, పెందుర్తిల వద్ద ఇంటర్ చేంజ్ జంక్షన్లు ఏర్పాటుచేశారు.

ఇంటర్ పరీక్షలకు 11,586 మంది విద్యార్థులు హాజరు

అనకాపల్లి టౌన్, మార్చి 11: జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం మేథ్స్-2/ జువాలజీ/ హిస్టరీ పరీక్షలకు సోమవారం 11,586 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి సుజాత తెలిపారు. మొత్తం 11,943 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి వుందని, అయితే 357 మంది హాజరుకాలేదని ఆమె పేర్కొన్నారు.

సీఎం నోట అబద్ధాల వరద!

- ప్రజలను మభ్యపెట్టడానికి జగన్‌రెడ్డి యత్నం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపణ

అనకాపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఆదివారం వైసీపీ నిర్వహించిన 'సిద్ధం' సభలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎప్పటిమాదిరిగానే అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఒక ప్రకటనలో విమర్శించారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 85 శాతం అమలు చేశామని చెప్పుకోవడం ఆయనకే చెల్లిందన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే ఉద్యోగుల సీపీఎస్ రద్దు, అంగన్‌వాడీలకు తెలంగాణలో కన్నా అదనంగా వేతనాలు చెల్లింపు, విద్యుత్ చార్జీలు తగ్గింపు, మద్య నిషేధం అమలు.. ఇలా ఎన్నో హామీలను అమలు చేయకుండా జగన్మోహన్‌రెడ్డి మాట తప్పారని ధ్వజమెత్తారు. ఇసుక, గ్రావెల్, మట్టి.. అన్ని రకాల ప్రకృతి వనరులను దోచుకుంటున్న వైసీపీ పాలకులు రానున్న ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు ప్రజల వద్దకు వెళితే నిలదీసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందని, దీంతో సిద్ధం సభలకు బలవంతంగా ప్రజలను తరలిస్తున్నారని పేర్కొన్నారు.

ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకం

- డీపీఆర్‌వో డి.సాయిబాబా


మాట్లాడుతున్న సాయిబాబా

తుమ్మపాల, మార్చి 11 : ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకమని డీపీఆర్‌వో డి.సాయిబాబా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాలానికి అనుగుణంగా మీడియాలో పలు మార్పులు వస్తున్నాయని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాయకుల ఉపన్యాసాలు కొత్తరూపం సంతరించుకుంటున్నాయని చెప్పారు. జిల్లా కో-ఆపరేటివ్ ఆడిట్ అధికారి జి.గోవిందరావు మాట్లాడుతూ, రాజకీయ పార్టీల ప్రకటనలకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల శిక్షణా కార్యక్రమాల కో-ఆర్డినేటర్ జయంతి, ఎంసీఎంసీ సభ్యులు నిర్మలాదేవి, గిరీశ్‌రెడ్డి, ఇంద్రావతి, నాగమణి, సత్యనారాయణ పాల్గొన్నారు.



బొర్రిగుడ గ్రామస్థులకు సూపర్-6 పథకాలను వివరిస్తున్న దొన్నుదొర

కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి

▸▸ టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర

అరకులోయ, మార్చి 11: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలుగుదేశం పార్టీ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. మాదల పంచాయతీ పరిధిలోని బొర్రిగుడ గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలతో కలిసి దొన్నుదొర ఇంటింటికీ వెళ్లి సూపర్-6 పథకాలను వివరించారు.మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ బండలు, ఇంటిలో చదువుకున్న వారందరికీ ప్రతి ఏటా రూ.15 వేల వంతున చెల్లించనున్నట్టు చెప్పారు. అలాగే ప్రతీ ఏటా రైతులకు పెట్టుబడి నిధి కింద రూ.20 వేలు, నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చేవరకు నెలకు రూ.3 వేల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. వీటితో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసే టీడీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక గిరిజనులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, 16 సంక్షేమ పథకాలను రద్దు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో కనీస మంచినీటి సౌకర్యం లేదని, సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిల్లో సింహాచలం, గురుమూర్తి, మోద్దు, దొన్నుగుబాయి జగన్నాథం, సమర్ధిగురు, పాంగి డొంబు, పద్మాపురం ఎంపీటీసీ సభ్యుడు సాయిరాం, పద్మాపురం మాజీ సర్పంచ్ వనాది పాల్గొన్నారు.

సూపర్-6 పథకాలతో పేదల బతుకుల్లో వెలుగులు



రేవళ్ల గ్రామంలో సూపర్-6 పథకాలను వివరిస్తున్న దొరబాబు, నాయకులు

కొయ్యూరు, మార్చి 11: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలు పేదల బతుకుల్లో వెలుగులు నింపుతాయని పార్టీ మండల కార్యదర్శి దొరబాబు అన్నారు. మండలంలోని రేవళ్ల గ్రామంలో సోమవారం సూపర్-6 పథకాలుపై ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే ఈ పథకాలు అర్హులందరికీ అందుతాయన్నారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ బూత్ కన్వీనర్‌లు స్వామి, వెంకటరమణ, టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి పండు తదితరులు పాల్గొన్నారు.

ఆప్కోస్ ఉద్యోగులకు వేతనాలు పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న టూరిజం కార్మికుల సంఘం ప్రతినిధి వనాది

అరకులోయ, మార్చి 11: ఏపీ టూరిజంలో పనిచేస్తున్న ఆప్కోస్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని సంఘం ప్రతినిధి కిల్లో వనాది డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ఉద్యోగులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఉద్యమం చేపడితే కాంట్రాక్టు ఉద్యోగులకు మాత్రమే యాజమాన్యం వేతనాలు పెంచిందని, ఆప్కోస్ ఉద్యోగులను విస్మరించిదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పోరేషన్‌లో కాంట్రాక్టు, మేన్‌పవర్, డైలీవేజ్ కార్మికులంతా సమానంగా పనిచేస్తున్నామని, కార్మికుల ఐక్యతను దెబ్బతీస్తూ విభజించు పాలించు విధానాన్ని అనుసరించి అన్యాయంగా వ్యవహరించడం తగదని ఆయన పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యమానికి తమ తోడ్పాటు ఉంటుందని చెప్పారు. కార్మికుల పక్షాన ఉండి పోరాడతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బొర్రా, తైడా జంగిల్‌బెల్స్, అనంతగి హిల్‌రిసార్టు, అరకులోయ మయూరి, హరితా రిసార్ట్‌లో పనిచేసే ఆప్కోస్ ఉద్యోగులు పాల్గొన్నారు

వేతనాల కోసం సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన



ఎంఈవో కార్యాలయ ఆవరణలో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

ముంచంగిపుట్టు, మార్చి 11: వేతనాల బకాయిలను వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు సోమవారం నిరసన తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్ల కార్డులు చేతబట్టి ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన వేతనాలను అందించాలని, సమ్మె కాలం ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, డిమాండ్లను నెరవేర్చాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు సురేష్, ఈశ్వర్, సూర్యనారాయణ, అనిల్, గౌరి తదితరులు పాల్గొన్నారు.

గుమ్మిరేవులలో ఆధార్ కేంద్రం ఏర్పాటు



గుమ్మిరేవులులో ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీలేరు ఎస్ఐ రామకృష్ణ

సీలేరు, మార్చి 11: గూడెంకొత్తవీధి మండలంలోని మారుమూల పంచాయతీ గుమ్మిరేవులలో సోమవారం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామాల సందర్శనకు వెళ్లినప్పుడు గిరిజనులు ఎక్కువగా ఆధార్ కార్డులు లేవని తమ దృష్టికి తీసుకువచ్చారని చెప్పార. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ, చింతపల్లి అదనపు ఎస్పీ దృష్టికి తీసుకు వెళ్లడంతో ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఆధార్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టారన్నారు. పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామాల గిరిజనులు ఈ కేంద్రానికి వచ్చి మార్పులు, చేర్పులు చేసుకోవాలని ఎస్ఐ సూచించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై సభ్యుల ధ్వజం

పాడేరు మండల సర్వసభ్య సమావేశం





మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రత్నకుమారి... హాజరైన ప్రజా ప్రతినిధులు

పాడేరు రూరల్, మార్చి 11: వేసవి ప్రారంభానికి ముందే తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సమంజసం కాదని వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ సొనారి రత్నకుమారి అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని వివిధ పంచాయతీల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఫిర్యాదులు అందించి నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని సర్పంచులు అసహనం వ్యక్తం చేశారు. కొంత మంది ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జలజీవన్ మిషన్ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తడంతో ఆదాయం వచ్చే పనులు తప్ప అభివృద్ధి పనులపై శ్రద్ధ చూపడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా గ్రామాల్లో తాగునీటి సౌకర్యాలు మెరుగుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.75 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదనలు చేశారు. ఈ నిధులతో తాగునీటి బోర్లు, సీసీ రోడ్లు, పాఠశాలల భవనాలకు మరమ్మతులు తదితర అభివృద్ధి పనులు చేపడతామని ఎంపీడీవో కె.సాయినవీన్ తెలిపారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ పనులు ఎందుకు పూర్తి చేయరు?

▸▸ డుంబ్రిగుడ మండల సర్వసభ్య సమావేశలో సభ్యుల నిలదీత



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న సర్పంచులు

డుంబ్రిగుడ, మార్చి 11: మండలంలో జల్‌జీవన్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, వీటిని ఎందుకు పూర్తి చేయడం లేదని సభ్యులు నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ ఈశ్వరి అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2021లో జల్‌జీవన్ మిషన్ కనెక్ట్ పథకంతో కొర్రాలో చేపట్టిన పనులు పూర్తయినప్పటికీ తాగునీటి సౌకర్యం కల్పించలేదని సర్పంచ్ అర్జున్, ఎంపీటీసీ సభ్యురాలు విజయ అధికారులను నిలదీశారు. అలాగే మండల వ్యాప్తంగా జరిగిన జల్‌జీవన్ పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయని ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు ఇప్పటికీ బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదని వెలుగు ఏపీఎంను పలువురు సభ్యులు నిలదీశారు. సాగర, గసభ పంచాయతీల్లో గ్రావెల్ రోడ్లకు శంకుస్థాపనలు చేసి ఇప్పటికీ పనులు ప్రారంభించలేదని ఎంపీటీసీ సభ్యులు దేవదాసు, సర్పంచ్ సునీత అధికారులను నిలదీశారు. లైగండ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన పాలుతో చిన్నారులు జలుబు, దగ్గుతో బాధపడుతున్నారని సర్పంచ్ శాంతి సంబంధిత శాఖ అధికారులకు నిలదీశారు. అరకు నుంచి ఆర్టీసీ సేవలను పునరుద్ధరించాలని జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ విన్నవించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ ఈశ్వరి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జయఉమ, తహసీల్దార్ హేమవతి, వైస్ ఎంపీపీలు ఆనందరావు, లలిత, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.





పవర్ టిల్లర్ల పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్, తదితరులు... సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

వ్యవసాయ యంత్రాలను వినియోగించుకోండి

ఐటీడీఏ పీవో అభిషేక్

14 పవర్ టిల్లర్లు, 140 పవర్ వీడర్ల పంపిణీ

పాడేరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు ప్రభుత్వం అందించే వ్యవసాయ యంత్రాలను వినియోగించుకోవాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో రూ.29.99 లక్షల విలువైన 14 పవర్ టిల్లర్లు, రూ.1.57 కోట్ల విలువైన 140 పవర్ వీడర్లను సోమవారం గిరిజన రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో రాయితీపై యంత్రాలను అందిస్తున్నామని చెప్పారు. రూ.2.14 లక్షల విలువైన పవర్ టిల్లర్‌కు ఉద్యానవన మిషన్ నుంచి రూ.75 వేలు, ఐటీడీఏ నుంచి మరో రూ.75 వేలు మొత్తం రూ.1.5 లక్షల రాయితీ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారు వాటాగా రూ.64,200 చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు. అలాగే రూ.1.12 లక్షల విలువైన పవర్‌వీడర్‌కు ఉద్యానవన మిషన్ నుంచి రూ.50 వేలు, ఐటీడీఏ నుంచి రూ.44,900 రాయితీ అందిస్తారని, లబ్ధిదారు వాటాగా రూ.17,300 చెల్లించాలని పీవో తెలిపారు. వ్యవసాయ ఉపకరణాల వినియోగంతో రైతులకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వీఎస్.ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, ఐటీడీఏ ఉద్యానవనాధికారి ఎన్.అశోక్, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, ఉద్యానవనాధికారులు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మౌలిక సదుపాయాలు

పాడేరు రూరల్: విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ చెప్పారు. మండ పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ఐనాడ, దేవాపురం, సలుగు, గుత్తులపుట్టు గ్రామ పంచాయతీల్లోని పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులకు 60 బెంచీలను మొదటి విడతగా పంపిణీ చేసినట్టు చెప్పారు. మిగిలిన మండలాల పంచాయతీ సర్పంచ్‌లు డెస్క్‌టాప్ ప్రాజెక్టుకు ముందుకు రావాలని పీవో కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి, ఎంపీడీవో సాయినవీన్, ఎంఈవో ఎస్.రామచందరరావు, సర్పంచులు, హెచ్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్లకు తాయిలాలు!

... 5వ పేజీ తరువాయి

కిట్లు, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్ కిట్లతో వారిని ప్రలోభపెట్టి తమ వైపు తిప్పుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు.

తాయిలాలకు లొంగిపోతే...అంతే!

ఎన్నికల సమయంలో నేతలు పంచే డబ్బు, ఇతర ప్రలోభాలకు లొంగిపోతే ఐదేళ్ల పాటు జీవితం అస్తవ్యస్తమవుతుందనే విషయాన్ని ఓటర్లంతా గుర్తుంచుకోవాలని మేధావులు సూచిస్తున్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే నేతలను ఎన్నుకుంటే మేలు జరుగుతుందని, పిల్లల భవిష్యత్తు మెరుగుపడుతుందని చెబుతున్నారు. ప్రస్తుత పాలకుల హయాంలో కనీస అవసరాలైన నీరు, రోడ్లు, విద్యుత్ తదితర సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతోందా?, అభివృద్ధి పనులు చేపడుతున్నారా?...వంటి విషయాలను పరిగణనలోకి తీసుకుని ఓటు వేయాలంటున్నారు. ప్రలోభాలకు, తాయిలాలకు లొంగిపోయి అసమర్థలను గెలిపిస్తే భవిష్యత్తు అంధకారం అవుతుందని ఏయూ విశ్రాంత ప్రొఫెసర్ పరమేశ్వరరావు హెచ్చరిస్తున్నారు.

200 కిలోల గంజాయి స్వాధీనం

... 5వ పేజీ తరువాయి

పంచాయతీ వరకు తీసుకువస్తే డబ్బులు ఇస్తానని చెప్పి కిల్లుపల్లి గ్రామానికి చెందిన పాంగి శ్రీను, కొర్ర సత్తిబాబులకు అడ్వాన్స్‌గా రూ.10 వేలు ఇచ్చి గంజాయి వ్యాపారి వెళ్లిపోయాడు. పాంగి శ్రీను, కొర్ర సత్తిబాబులు గంజాయి లోడ్‌తో ఉన్న ట్రాక్టర్‌ను సోమవారం ఉదయం నర్సీపట్నం తరలించేందుకు ప్రయాణమయ్యారు. అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారంతో అన్నవరం ఎస్ఐ ఐ.రాజారావు చెరుకుంపాకలు జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు ప్రారంభించారు. ట్రాక్టర్‌తో పాటు చెరుకుంపాకలు జంక్షన్ వద్దకు వచ్చిన ఆ ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి వాహనాన్ని విడిచి పెట్టి పారిపోయే ప్రయత్నం చేశారు. వెంటనే అప్రమత్తమైన ఎస్ఐ, పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి గంజాయి, ట్రాక్టర్, రెండు సెల్‌ఫోన్లు, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేశామని, పరారీలో ఉన్న గంజాయి వ్యాపారి, ఒడిశాలో గంజాయి విక్రయించిన వ్యక్తి కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ రాజారావు, ఏఎస్ఐ మూర్తి పాల్గొన్నారు.

కాఫీ గింజల ఉత్పత్తిలో నాణ్యత పాటిస్తే గరిష్ఠ ధరలు

... 5వ పేజీ తరువాయి

అధికంగా శ్రమించాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ పల్పర్లు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఈ పల్పర్ల వినియోగం వల్ల తక్కువ సమయంలో అధిక కాఫీ పండ్లను పార్చిమెంట్‌గా ఉత్పత్తి చేసుకోవచ్చునని, శ్రమ తగ్గుతుందన్నారు. ఈ ఎలక్ట్రానిక్ కాఫీ పల్పర్ ధర రూ.58,248 కాగా, 50 శాతం కాఫీ బోర్డు, 35 శాతం ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ రాయితీ కల్పిస్తుందన్నారు. రైతు కేవలం 15 శాతం ధర చెల్లించి పల్పర్లు పొందవచ్చునన్నారు. ఎలక్ట్రానిక్ కాఫీ పల్పర్లను ఉపయోగించుకుని రైతులు అత్యధిక కాఫీ పండ్లను పార్చిమెంట్‌గా తయారు చేసుకోవాలని సూచించారు. రైతులు తోటల్లో పండిన పండ్లను ఎప్పటికప్పుడు సేకరించుకుని పల్పింగ్ చేసుకుంటే నాణ్యమైన పప్పును పొందవచ్చునన్నారు. కాయలు, పండ్లు కలిపి పల్పింగ్ చేయరాదన్నారు. బాగా పండిన పండ్లను మాత్రమే పల్పింగ్ చేసుకోవాలన్నారు. పల్పింగ్ చేసుకున్న గింజలను సిమెంట్ కల్లాల్లో మాత్రమే ఎండబెట్టుకోవాలని తెలిపారు. ఈ నియమాలు పాటిస్తే మార్కెట్‌లో మంచి ధర పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి రమేశ్, ఏపీఎఫ్‌పీఎస్ జోనల్ మేనేజర్ సాయి శ్రీనివాస్, కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు జైతి ప్రభాకరరావు, ఇరిగేషన్ డీడీ రహీమ్, యూబీఐ మేనేజర్ పెనుమల నారాయణరావు, జేఎల్‌వో ఎస్.ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.



రైస్ మిల్లులు అందిస్తున్న వాసన్ ప్రతినిధులు

నాటుకోళ్ల పెంపకందారులకు మినీ రైస్ మిల్లులు

పాడేరు రూరల్, మార్చి 11: మండలంలో నాటుకోళ్ల పెంపకం చేపట్టే పది మంది గిరిజన రైతులకు సోమవారం రైస్ మిల్లులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ సంచాలకులు సిహెచ్.నరసింహులు మాట్లాడుతూ కోళ్ల పెంపకం రైతులు సంక్షేమానికి వాసన్ ప్రతినిధులు అందించిన రైస్ మిల్లులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మిల్లుల వల్ల ఇంటి వద్దే ధాన్యాన్ని ఆడించి ఇవ్వడంతో తవుడు, నూకలు మిల్లు యజమానికి మిగులుతాయన్నారు. అనంతరం గ్రామంలో కోళ్లు, మేకలకు పశువైద్యాధికారులు డీవార్మింగ్ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజా రవికుమార్, వాసన్ ప్రతినిధులు సన్నీ, నరసింగరావు, దామోదర్, చరణ్, డీపీఎం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పసుపు కొనుగోలుకు వర్తకుల పోటీ

గూడెంకొత్తవీధి, మార్చి 11: మండలంలో పసుపు కొనుగోలుకు వ్యాపారులు పోటీ పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పొరుగు జిల్లాల వ్యాపారులు ఈ ప్రాంతానికి వచ్చి పసుపు కొనుగోలు చేస్తున్నారు. సోమవారం ఆర్‌వీ నగర్ వారపు సంతలో వర్తకులు కిలో రూ.100కు కొనుగోలు చేశారు. సాధారణంగా స్థానికులు, చింతపల్లి, నర్సీపట్నం వ్యాపారులు మాత్రమే గిరిజనుల వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, విజయనగరం వర్తకులు సైతం ప్రాంతానికి వచ్చి రైతుల నుంచి నేరుగా పసుపును కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది మార్కెట్ ప్రారంభంలో ప్రాంతీయ వర్తకులు కిలో పసుపు రూ.80 ధరకు కొనుగోలు చేశారు. గత వారం కిలో ధర రూ.90కి పెరిగింది. ప్రస్తుతం వ్యాపారుల్లో పోటీ పెరగడంతో వర్తకులు కిలో రూ.100కు కొనుగోలు చేస్తున్నారు. పసుపు ధర భారీగా పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులకు మంచి ధర

చింతపల్లి, మార్చి 11: విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సీదరి ఉజ్వల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతు ఉత్పత్తిదారు సంఘాలతో సోమవారం మార్కెటింగ్‌పై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు పండించిన పసుపు, అల్లం, మిరియాలు, కాఫీ, రాజ్‌మా పంటలు శుద్ధి, గ్రేడింగ్ చేసి మార్కెట్‌లో విక్రయించాలన్నారు. దీనివల్ల మంచి ధరలు పొందవచ్చునన్నారు. అలాగే ఎఫ్‌పీవోల ద్వారా పసుపు పొడిగా చేసుకు విక్రయించవచ్చునన్నారు. రైతులు ఎఫ్‌పీవోలను ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం నుంచి కోల్డ్ స్టోరేజీలు, గోదాములు, రాయితీ యంత్రాలు అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

గిరిజన విద్యార్థినికి అస్వస్థత

పసరమందులతో చికిత్సతో వ్యాధి తీవ్రం

అంబులెన్సులో నర్సీపట్నం ఆస్పత్రికి తరలింపు

చింతపల్లి, మార్చి 11: మండల కేంద్రంలోని బాలిక ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న గెమ్మెలి చాందిని అస్వస్థతకు గురైంది. ఈ నెల 7వ తేదీన సెలవుపై గృహానికి వెళ్లిన విద్యార్థినికి 9వ తేదీ రాత్రి తీవ్ర జ్వరం రావడంతో తల్లిదండ్రులు పసర మందులు పట్టారు. మరుసటి రోజు వ్యాధి అదుపులోకి రాకపోగా తీవ్రమైంది. ఈ విషయాన్ని గ్రామ వలంటీర్ హెచ్‌డబ్ల్యూవో నూకరత్నంకు ఫోన్‌లో తెలియజేయడంతో, ఆమె వెంటనే గ్రామానికి వెళ్లి ప్రత్యేక వాహనంలో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ వైద్యులు ప్రథమ పరీక్షలు చేసి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. దీనికి తల్లిదండ్రులు నిరాకరించగా, ఏటీడబ్ల్యూవో కౌన్సెలింగ్ ఇచ్చి ఒప్పించారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్యం నిలకడగా ఉందని ఏటీడబ్ల్యూవో తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయ ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

పాడేరు రూరల్, మార్చి 11: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రహరీ గోడ నిర్మాణానికి ఎంపీపీ ఎస్.రత్నకుమారి శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.15.6 లక్షల వ్యయంతో ప్రహరీ గోడతో పాటు రూ.4 లక్షల వ్యయంతో వైర్‌పెన్సింగ్ చేపట్టేందుకు సోమవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీవో కె.సాయినవీన్, ఇంజనీరింగ్ అధికారి ఎస్‌వీబీ.ప్రసాద్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మత్స్యపురంలో రచ్చబండ నిర్మాణం

హుకుంపేట: కోట్నాపల్లి పంచాయతీలోని మత్స్యపురం గ్రామంలో జిల్లా పరిషత్ నిధులతో రచ్చబండ నిర్మాణ పనులకు జడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.2 లక్షలతో రచ్చబండ నిర్మాణ పనులు ప్రారంభించామని, ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవిప్రసాద్‌కొండబాబు, బొంజుబాబు పాల్గొన్నారు

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

జి.మాడుగుల, మార్చి 11: మండలంలోని తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీవో లోహిత్ జయసాగర్ తెలిపారు. సమ్మర్ క్రాస్ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో తాగునీటి బోర్లు మరమ్మతులకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. అందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీడీవో కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, పీఆర్ ఏఈ మాణిక్యం సమిరెడ్డి, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, బోరు వెల్ సిబ్బంది బాలు, రవి పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయలు

జి.మాడుగుల, మార్చి 11: మండలంలోని గెమ్మెలి పంచాయతీ బలమానుశంక గ్రామానికి చెందిన కురిడే మల్లేశ్వరరావు సోమవారం ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఉరుము సమీపంలో ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని స్థానిక పీహెచ్‌సీలో చేర్చగా, ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అంతకు ముందు టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, నాయకులు నితిన్‌కుమార్, బాబూరావు ఆసుపత్రికి సందర్శించి మల్లేశ్వరరావుకు పరామర్శించారు.

అంబులెన్స్‌కు తప్పిన పెను ప్రమాదం

పెదబయలు, మార్చి 11: మండలంలోని గోమంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఓ ఫీడర్ అంబులెన్స్‌కు ప్రమాదం తప్పింది. సోమవారం గుల్లెలు గామంలో ఆనారోగ్యంతో ఉన్న గుల్లెలి రామనాయుడును స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్చడానికి కుటుంబ సభ్యులు ఫీడర్ అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో టెక్నీషియన్ ప్రభాకర్ వాహనంతో గ్రామానికి చేరుకొని జ్వర పీడుతులను ఆస్పత్రిలో చేర్చే సమయంలో మార్గమధ్యంలో ఫీడర్ అంబులెన్స్‌లో మంటులు చెలరేగాయి. రోగిని భద్రంగా వాహనం నుంచి దించి గ్రామస్థుల సహాయంతో మంటలను అదుపు చేశారు. అనంతరం రోగిని గోమంగి పీహెచ్‌ఎసీలో తరలించారు.

రైల్వే గేటు మొరాయింపు

▸▸ రెండు వైపులా స్తంభించిన వాహనాలు



రైల్వే గేటుకు రెండు వైపులా భారీగా నిలిచిపోయిన వాహనాలు

డుంబ్రిగుడ, మార్చి 11: అరకు-పాడేరు ప్రధాన రహదారిలోని కురిడి రైల్వే గేటు సోమవారం ఉదయం మొరాయించింది. విశాఖ నుంచి కిరండోల్ రైల్వే లైనులో గూడ్సు రైలు రాకపోకలకు వీలుగా గేటు పడడంతో వాహనాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో గూడ్సు రైలు వెళ్లిపోవడంతో తెరుచుకోవాల్సిన గేటు గంట పాటు మొరాయించింది. ఫలితంగా వాహనదారులు, ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు. రెండు పక్కల వాహనాలు ఎక్కడిక్కడే నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సంబంధిత అధికారులు మరమ్మతులు చేయడంతో యథావిధిగా వాహనాలు రాకపోకలు సాగించాయి.

చలివేంద్రాలు ఏర్పాటుచేయరూ...

ముంచంగిపుట్టు, మార్చి 11: మండల కేంద్రంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచే ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఫలితంగా వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రంలో గల ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు తాగునీరు అందుబాటులో లేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ ప్రభుత్వ కార్యాలయం ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పదుల కిలోమీటర్లు మండు టెండలో కాలినడకన మండల కేంద్రం వచ్చేవారు ఎండ దెబ్బకు వారంతా విలవిలలాడిపోతున్నారు. వారికి అందుబాటులో తాఉనీరు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులు స్పందించి జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేస్తే ఎంతో బాగుంటుందని స్థానిక ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు.